నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 29 డిసెంబర్ 2024 | HYDERABAD

వీకెండ్ కావడంతో శనివారం మాదాపూర్‌లోని శిల్పారామానికి నగరవాసులు కుటుంబసమేతంగా తరలివచ్చారు. కలియతిరుగుతూ..బోటు షికారు చేస్తూ..సందడి చేశారు.

నుమాయిష్ వచ్చేస్తున్నది.. | వచ్చే బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఎగ్జిబిషన్ కోసం ముస్తాబవుతున్న దుకాణాలు

మల్కం చెరువు రోడ్‌లో ప్రహరీపై వేసిన పెయింటింగ్

# మూసీ ఆక్రమణలపై చర్యలుంటాయి

**నివాస గృహాలు కూల్చం.. కమర్షియల్ నిర్మాణాలను కూల్చేస్తాం ● యజమానులకే కాదు.. కిరాయిదారులకూ నోటీసులిస్తాం ● కొందరు అధికారులపై చర్యలకు సిఫారసు చేస్తున్నాం**
**త్వరలోనే హైడ్రా పోలీస్‌స్టేషన్, ఎఫ్‌ఎం రేడియో ఏర్పాటు ● కొత్త సంవత్సరంలో దూకుడుగా వెళ్తాం ● వార్షిక సమావేశంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్**

సిటీబ్యూరో:మూసీ రివర్‌ఫ్రంట్ బోర్డుతో తమకు సంబంధం లేదని, అయినప్పటికీ మూసీ ఆక్రమణలపై చర్యలుంటాయని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. నాలా వెడల్పులకు సంబంధించిన సమాచారం తీసుకుంటున్నామని , మూసీలో ఎక్కడెక్కడ ఆక్రమణలు జరిగాయో.. తమకు తెలిసిన చోట కూడా బిల్డర్స్‌కు చెప్పామని వారు తొలగించారని చెప్పారు. రాబోయే సంవత్సరంలో మూసీ ఆక్రమణలపై బిల్డర్స్‌ను ప్రాసిక్యూట్ చేస్తామని రంగనాథ్ అన్నారు. హైడ్రా ఏర్పడిన తర్వాత తమ పనితీరు, రాబోయే సంవత్సరంలో ఎలాంటి కార్యాచరణతో ముందుకెళ్తామన్న విషయాలపై శనివారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో ఏవీ రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. జూలై 19న హైడ్రా ఏర్పాటైందని, ఓఆర్‌ఆర్ లోపల 2వేల చదరపు కిలోమీటర్ల మేర హైడ్రా పరిధిలోకి వస్తుందని, తెలంగాణలో 35 శాతం జనాభా తమ పరిధిలో ఉంటారని రంగనాథ్ తెలిపారు. హైడ్రా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించామని, 12 చెరువులను, 8 పార్కులను అన్యాక్రాంతం కాకుండా కాపాడామని రంగనాథ్ తెలిపారు. ఆరు నెలల్లో హైదరాబాద్‌లో వర్షాలు పడి నీటమునిగితే హైడ్రా ఏం చేయలేదనే భ్రమలో ఉండొద్దని, హైడ్రా తీసుకొచ్చిందే ఆస్తులను కాపాడటం కోసమేనన్నారు. క్లౌడ్ బరస్ట్‌లు పెరిగాయని, ఐదు పదేండ్లు నిర్విరామంగా చేస్తే తప్ప ఏం చేయలేమన్నారు. హైడ్రా ఏర్పాటుతో ప్రజల్లో బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లపై అవగాహన పెరిగిందని, తాము ఏదైనా కొనాలనుకుంటే పూర్తిగా చెక్ చేసుకున్న తర్వాతే కొనుగోలు చేస్తున్నారన్నారు. హైడ్రా అంటే కూల్చివేతలే కాదని, పునరుజ్జీవనం కూడా హైడ్రా లక్ష్యమని, పన్నెండు చెరువుల పునరుద్ధరణకు సంబంధించి హైడ్రా డీపీఆర్ తయారు చేసిందన్నారు. బడ్జెట్ ఇస్తే తామే చెరువులను అభివృద్ధి చేస్తామని, లేకుంటే ఏజెన్సీలకు ఇస్తే సహకరిస్తామని తెలిపారు. చెరువులకు సంబంధించి ఎక్కడైతే ఖాళీ జాగా ఉందో దానిని తాము స్వాధీనం చేసుకుంటున్నామని, ఇదే క్రమంలో ఖాజాగూడకు సంబంధించి పర్మిషన్ ఎక్కడి వరకు ఉందో అక్కడి వరకు ఒప్పుకుంటామని, ముందుకు వస్తే మాత్రం ఊరుకోబోమని చెప్పినట్లు తెలిపారు. ఓఆర్‌ఆర్ పరిధిలో 1025 చెరువులను గుర్తించామని, రకరకాల డేటాల ద్వారా వచ్చే ఏడాది కల్లా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తామని, చెరువుల హద్దులపై గ్రౌండ్ వర్క్ జరుగుతున్నదని, సాంకేతిక పరిజ్ఞానంతో చెరువులకు సరిహద్దులు, బఫర్‌జోన్‌లు నిర్ణయిస్తున్నామని, వీటిపై స్పష్టత రాగానే హైడ్రా యాక్టివ్ అవుతుందని రంగనాథ్ తెలిపారు. శాటిలైట్ ఇమేజ్‌తో అత్యంత రెజుల్యూషన్ ఉన్న డేటాను తీసుకుంటున్నామని, 2000 నుంచి 2024 వరకు శాటిలైట్ ఫొటోలతో పాటు 2006 నుంచి 2023 వరకు ఏరియల్ డ్రోన్ ఇమేజెస్ కూడా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కోసం వాడుతున్నామని తెలిపారు. ఇప్పటివరకు హైడ్రాకు 5800 ఫిర్యాదులు వచ్చాయని, 27 మున్సిపాలిటీల్లో అనధికార నిర్మాణాలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని వెల్లడించారు. రోజురోజుకూ హైడ్రాకు వచ్చే ఫిర్యాదులు పెరుగుతున్నాయని, ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులకే ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నామని రంగనాథ్ తెలిపారు.

### శిఖంపట్టా ఉన్నవారికి హక్కులుండవు..

బుద్ధభవన్ బఫర్‌జోన్‌లో ఉంటుందంటున్న ప్రశ్నకు బుద్ధభవన్ కింద ఉన్న నాలాను ఎక్కడా బ్లాక్ చేయడం లేదని స్పష్టం చేశారు. చెరువులను కబ్జా చేస్తున్నదానిపై శిఖం పట్టా అనేది కీలకమన్నారు. శిఖం పట్టా కింద తీసుకుని కబ్జాలకు చేస్తున్న దానిపై తాము న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నామన్నారు. అసలు శిఖం పట్టా విషయంలో ఇందులో రెండురకాలుంటాయన్నారు. ఒకటి సర్కారీ శిఖం, మరొకటి శిఖం పట్టా ఉంటుందని, చెరువు తయారు చేసేటప్పుడు శిఖం పట్టాకు పరిహారం ఇచ్చే చేస్తామని, ఆ తర్వాత ఎక్‌సాల్ పట్టా ఇస్తారన్నారు. ఆ తర్వాత లీజ్ రెన్యువల్ కాకుండా పహనీలో పట్టా అని రావడం వల్ల సమస్యలు వస్తున్నాయన్నారు. శిఖం పట్టా ఉన్న వారికి ఎలాంటి ఓనర్ షిప్ ఉండదని, వారు కేవలం సాగు చేయడం తప్ప..హక్కులు ఉండవన్నారు.

### అధికారులపై చర్యలకు సిఫారసు..!

చెరువుల ఆక్రమణలు తొలగించే సమయంలో అక్కడ ఆక్రమణలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుంటున్నామని రంగనాథ్ తెలిపారు. గండిపేట వంటి చాలా చోట్ల అధికారులపై చర్యలకు సిఫారసు చేశామన్నారు. నిజాంపేటకు సంబంధించిన చెరువుల ఆక్రమణలకు సంబంధించి 6గురిపై, ఆ తర్వాత ఐదుగురిపై చర్యలకు సిఫారసు చేశామన్నారు. చాలా మంది అధికారులను కూడా ఆక్రమణల విషయంలో గుర్తించామన్నారు.

### త్వరలో హైడ్రా పీఎస్..ఎఫ్ఎం రేడియో..

ప్రస్తుతం హైడ్రాకు 15 బృందాలు పనిచేస్తున్నాయని, మరికొందరిని కూడా రిక్రూట్ చేసుకుంటున్నామని రంగనాథ్ తెలిపారు. త్వరలోనే 72 డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులోకి వస్తాయన్నారు. వెదర్ డేటాను విశ్లేషించేందుకు హైడ్రాలో ఒక టీంను ఏర్పాటు చేస్తున్నామని, హైడ్రాకు త్వరలో ఒక ఎఫ్ఎం చానల్ ఏర్పాటుకు కూడా ప్రయత్నిస్తున్నామన్నారు. హైడ్రా కార్యాలయంలో వచ్చే ఏడాది నుంచి ప్రతీ సోమవారం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకే ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. హైడ్రా ఆధ్వర్యంలో త్వరలోనే పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు.

### చెరువే లేదు.. చర్చ ఎందుకు..

మెడ మీద తల ఉంటదా.. తల మీద మెడ ఉంటదా.. అనే అడిగితే మెడ మీద తల ఉన్నట్లుగా చెరువుకట్టకు పైన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ఉంటుందని.. చెరువుకట్టకు కిలోమీటర్ దూరంలో మేం ఉంటామని రంగనాథ్ తెలిపారు. అక్కడ చెరువే లేదని, లేని చెరువు గురించే చర్చ చేస్తున్నామన్నారు. బఫర్, ఎఫ్‌టీఎల్ ఎప్పుడొస్తుందంటే.. నీరు ప్రవహిస్తూ వచ్చినప్పుడు అడ్డుకట్ట అయినప్పుడు అక్కడ నీరు ఆగి దాని అప్‌స్ట్రీమ్ అంతా మునిగిపోతుందని, అక్కడ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు వస్తాయన్నారు. 'మా ఇల్లు డౌన్ స్ట్రీమ్‌లో కిలోమీటర్ దూరంలో ఉన్నప్పుడు అక్కడ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఎందుకు వస్తుంద'ని ప్రశ్నించారు.

### ఇకపై కిరాయిదారులకూ నోటీసులు..

శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా ఆక్రమణలను గుర్తిస్తున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. నగరంలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కఠినంగానే ఉంటుందని, జూలై తర్వాత అనధికారికంగా, వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించే వాటిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. హైడ్రా ఏర్పాటుకు ముందు అనుమతులు ఉన్నా.. లేకున్నా నివాసగృహాల జోలికి హైడ్రా పోదని, ఇకపై ఆక్రమణలు చేస్తే మాత్రం ఊరుకోమని చెప్పారు. ప్రభుత్వం ఒక పాలసీని తీసుకొచ్చినప్పుడు కట్ ఆఫ్ డేట్ పెట్టి అక్కడి నుంచి చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమణలను ఆక్రమణలుగా చూస్తామని, అయితే నివాస గృహాలు కాకుండా కమర్షియల్‌గా ఉన్నవాటిని మాత్రం ఊరుకునేది లేదని రంగనాథ్ తెలిపారు. ఎఫ్‌టీఎల్‌లో అనాథరైజ్డ్ షెడ్స్ ఉంటే తాము ఊరుకోబోమని చెప్పారు. నోటీసుల విషయంలో కూడా ల్యాండ్ ఓనర్స్‌కు ఇవ్వడం వారు కిరాయిదారులకు కమ్యూనికేట్ చేయకపోవడం వల్ల కొన్ని సమస్యలు వచ్చాయని, ఇకపై కిరాయిదారులకు కూడా నోటీసులు ఇస్తామని రంగనాథ్ స్పష్టం చేశారు.

# కొత్త ఏడాదిలోనే కూల్చివేతలు

**ఓల్డ్ సిటీ మెట్రో భూసేకరణ ప్రక్రియ వేగవంతం**

**మిగిలిన 500 ఆస్తుల సేకరణపై కార్యాచరణ**

సిటీబ్యూరో: ఓల్డ్ సిటీ మెట్రో కూల్చివేతలు కొత్త ఏడాదిలోనే ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ సాగుతుండగా, రెండు వారాల్లోగా ప్రక్రియ పూర్తి చేసే లక్ష్యంగా హెచ్ఎంఆర్ఎల్ పెట్టుకున్నది. ఇప్పటికే కొంత మంది యజమానులకు పరిహారం ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తుండగా... జనవరి రెండు, లేదా మూడో వారంలో తొలి దశ కూల్చివేతలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు మెట్రో వర్గాలు చెబుతున్నాయి.

### 7.5కిలోమీటర్ల పొడువైన మెట్రో..

ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణపై హెచ్ఎంఆర్ఎల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 7.5 కిలోమీటర్ల పొడువైన మెట్రోను ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నిర్మించనున్నారు. ఫేస్-2లో ఇదీ మొదటి కారిడార్ కానుండగా ప్రాజెక్టు కోసం 1100 ఆస్తులను సేకరించేందుకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో 800 ఆస్తులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను పలు దఫాలుగా జిల్లా రెవెన్యూ అధికారులు చేపట్టారు. ఇందులోనూ 400 ఆస్తులకు డిక్లరేషన్ పూర్తి చేయగా, ఇందులో 200 ఆస్తులకు పరిహారం అందించనుండగా, మరో 200 ప్రాపర్టీ ఓనర్లతో సంప్రదింపులు చేస్తున్నారు. అయితే ప్రిలిమినరీ నోటిఫికేషన్‌లోకి రాని 300 ఆస్తుల సేకరణపై దృష్టి పెట్టారు. మొదటి దశ ఆస్తుల పరిహారానికి చెల్లింపులు మొదలైతే గనుక... ప్రక్రియ వేగం పుంజుకుంటుందని, స్వచ్ఛందంగా యజమానులు కూడా ఆస్తులను అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నట్లుగా మెట్రో వర్గాలు చెబుతున్నాయి. ఆస్తుల సేకరణకు సానుకూలంగా ఉన్న పలువురు యజమానులు మెట్రో వర్గాలతో సంప్రదింపులు జరుపుతున్నారు.

### కొత్త ఏడాదిలో కూల్చివేతలు..

ఓల్డ్ సిటీ మెట్రో పనులు కొత్త ఏడాదిలో వేగం పుంజుకోనున్నది. జనవరి మొదటి వారంలోనే పరిహారం చెల్లింపులతోపాటు, కూల్చివేతల పనులు మొదలు కానున్నాయి. మెట్రో వల్ల రోడ్డు విస్తరణ ప్రభావితం అవుతున్న వారసత్వ, మతపరమైన కట్టడాలకు నష్టం లేకుండా ప్రాజెక్టును చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఓల్డ్ సిటీ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో పనులను హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ ఆధ్వర్యంలో సాగనున్నాయి.

# సర్కారు భూముల్లో ఆక్రమణల తొలగింపు

దుండిగల్, డిసెంబర్ 28: నిజాంపేటలోని ప్రభుత్వ భూముల్లో వెలసిన పలు నిర్మాణాలను రెవెన్యూ అధికారులు శనివారం కూల్చివేశారు. 'జాగా కనిపిస్తే.. పాగా' పేరిట 'నమస్తే'లోప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. అయితే నామమాత్రంగా కూల్చివేతలు చేపట్టి.. మమ అనిపించారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇందులో ప్రధానంగా ఓ బడా బిల్డర్ ప్రభుత్వ భూమిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల జోలికి అధికారులు అసలే పోలేదనే ఆరోపణలున్నాయి. కానీ కొందరు పేదలకు సంబంధించిన నిర్మాణాలను మాత్రం నేలమట్టం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బడా బిల్డర్ వెనుక ఓ నాయకుడు ఉండి కథ నడిపిస్తుండటంతోనే అధికారులు అటు వైపు కన్నెత్తి చూడలేదని పలువురు పేర్కొంటున్నారు. రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా స్పందించి సదరు బిల్డర్ ప్రభుత్వ భూమిలో నిర్మాణాలను తొలగించి అందరి పట్ల ఒకేలా..వ్యవహరించాలని కోరుతున్నారు.

# కుల వృత్తులకు జీవం పోసిన కేసీఆర్

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

బడంగ్‌పేట, డిసెంబర్ 28: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుల వృత్తులకు జీవం పోశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ చందన చెరువు కట్టపై శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి విగ్రహాన్ని ఎమ్మెల్సీ మధుసూదనాచారితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కేసీఆర్‌ను దేవాలయాల అభివృద్ధికి, కుల సంఘాల భవనాల కోసం అడగకుండానే నిధులు కేటాయించి భవనాలు, దేవాలయాలను అభివృద్ధి చేయించారని ఆమె గుర్తు చేశారు. ఏదీ అడిగినా వెంటనే కేటాయించే వారన్నారు. లెనిన్ నగర్‌లో వీర బ్రహ్మేంద్ర స్వామి దేవాలయ నిర్మాణానికి స్థలం కేటాయించినట్లు చెప్పారు. పక్కనే పేద ప్రజల కోసం ఫంక్షన్ హాల్ నిర్మించినట్లు పేర్కొన్నారు. పది లక్షలతో గుడి నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. విశ్వ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. వీర బ్రహ్మేంద్ర స్వామి అందరి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. అలాంటి మహనీయుని విగ్రహం చందన చెరువు కట్టపై ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి జ్ఞాన బోధన చేసిన గొప్ప వ్యక్తి వీర బ్రహ్మేంద్రస్వామి అని ఆయన అన్నారు. సామాజిక, ఆర్థిక అసమానతలపై తిరుగుబాటు చేసిన మహాయోధుడు అని అన్నారు. బ్రహ్మంగారిని సంఘ సంస్కర్తగా ప్రపంచం గుర్తించిందన్నారు. కాగా, వేర్వేరుగా విగ్రహ విష్కరణ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, టీయూఎఫ్‌యూడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట మేయర్ పారిజాత నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిల్లెలగూడలోని చందన చెరువు కట్టపై పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి

# బిల్లులు చెల్లిస్తారా..లేదా..

**బల్దియా కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్ల నిరసన**

సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్లు ఆందోళన చేపట్టారు. రూ. 1400కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా కమిషనర్ ఇలంబర్తి అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదంటూ కమిషనర్ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అప్పుల ఊబిలో కాంట్రాక్టర్లు కూరుకుపోయారని, తీవ్ర ఆర్థిక ఒత్తిడితో నలుగురు కాంట్రాక్టర్లు చనిపోయారని కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ స్పందించి బిల్లులు విడుదల చేయాలని, లేదంటే జీహెచ్ఎంసీ వ్యాప్తంగా 3వేల మంది కాంట్రాక్టర్లు చేస్తున్న పనులను నిలిపివేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# కబ్జాదారుల నుంచి కబేళాను కాపాడండి

**జీహెచ్ఎంసీ ఎదుట ఆరె కటిక, సీపీఎం ఆందోళన**

సిటీబ్యూరో: గౌలిపురా మున్సిపల్ కబేళాను కాపాడాలని, భూ కబ్జాదారులతో కుమ్మక్కైన బల్దియా అధికారులను సస్పెండ్ చేయాలని కోరుతూ ఆరె కటిక సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం ప్రతినిధి బృందం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అధికారుల నుంచి వివరాలు తెప్పించుకుని వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తానని కమిషనర్ హామీ ఇచ్చినట్లు సీపీఎం నేత శ్రీనివాస్ తెలిపారు. 1955 నుంచి పహాని, రెవెన్యూ రికార్డుల్లో 4.22 ఎకరాల స్థలంలో కబేళా ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలున్నాయని వివరించారు. మున్సిపల్ కబేళాను కబ్జాల నుంచి కాపాడడానికి జీహెచ్ఎంసీ వివిధ కోర్టులో ప్రయత్నిస్తున్నప్పటికీ కొందరు బల్దియా అధికారులు కుట్రపూరితంగా కబ్జాదారులకు అనుగుణంగా హైకోర్టులో ఆఫిడవిట్ వేయడంతో న్యాయస్థానం కబ్జాదారులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరించిన జీహెచ్ఎంసీ అధికారులను, స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఆరె కటిక సంఘం అధ్యక్షులు యశ్వంతరావు, ప్రధాన కార్యదర్శి రమేశ్, స్లాటర్ హౌస్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివకుమార్, సీపీఎం యాకత్‌పుర జోన్ కార్యదర్శి బాలు పాల్గొన్నారు.

**24 గంటల సమయమివ్వండి..**

# బాధ్యులెవరైనా చర్యలు తీసుకుంటాం

**కార్మిక నేతలతో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప**

ఖైరతాబాద్, డిసెంబర్ 28 : 'నిమ్స్ కార్మికుడు లింగయ్యపై జరిగిన ఘటన బాధాకరం.. 24 గంటల సమయం ఇవ్వండి....బాధ్యులపై చర్యలు తీసుకుంటాం' అని డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అన్నారు. శనివారం నిమ్స్ కార్మికులు, వివిధ కార్మిక సంఘాలతో డైరెక్టర్ సమావేశమయ్యారు. లింగయ్యపై జరిగిన ఘటనపై ఆయా సంఘాల నాయకులతో చర్చించారు. సెక్యూరిటీ అధికారి రామారావు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు వల్ల అన్యాయంగా అమాయకుడిని ఎలాంటి నిజ నిజాలు తెలుసుకోకుండా పోలీసులు చితకబాదారని ఆయా నేతలు తెలిపారు. డైరెక్టర్ మాట్లాడుతూ నిమ్స్‌లో ఇలాంటి ఘటనలు జరిగిన వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, లేదా సూపరింటెండెంట్, ఆర్ఎంఓకు తెలుపాలని సూచించారు. ఏకపక్ష నిర్ణయాల వల్ల ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. 24 గంటల్లో పూర్తి విచారణ జరుపుతామని, బాధ్యులు ఎంతటి వారైనా వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడుతున్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

# కావాలనే కాలయాపన?

**రేషన్ కార్డుల దరఖాస్తుదారుల్లో అనుమానం**
**దరఖాస్తు చేసి ఏడాది గడిచినా.. అతీగతి లేదన్న విమర్శలు**
**కొత్త కార్డుల అందజేతకు స్పష్టత కరువు**

మేడ్చల్, డిసెంబర్28(నమస్తే తెలంగాణ): రేషన్ కార్డుల దరఖాస్తుదారుల్లో అయోమయం నెలకొంది. వచ్చే సంక్రాంతి నుంచి రేషన్ కార్డుల కోసం కొత్త దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ప్రజాపాలనలో రేషన్ కార్డుల కోసం ఇచ్చిన దరఖాస్తుల పరిస్థితి ఏమిటని అర్జీదారులు ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాపాలనలో వివిధ పథకాల కోసం తీసుకున్న దరఖాస్తులతో పాటు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను ప్రభుత్వం స్వీకరించిన విషయం తెలిసిందే. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా రేషన్ కార్డుల కోసం 1, 22 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులకు ఏడాది పూర్తయిన ఇప్పటి వరకు కార్డుల మంజూరికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. అయితే కొత్త రేషన్ కార్డులను వచ్చే సంక్రాంతి తర్వాత మంజూరు చేస్తామని చెబుతూనే మరోసారి కొత్త వారి నుంచి దరఖాస్తుల స్వీకరణకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రభుత్వ ప్రకటన మేరకు ఏడాది కిందట చేసిన దరఖాస్తులకే దిక్కులేదని, కొత్త వారికి రేషన్ కార్డులు అందిస్తారా అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

### కార్డు లేకపోవడంతో..

రేషన్ కార్డుల జారీపై ప్రభుత్వానికి స్పష్టత లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. రేషన్ సరకులతో పాటు ప్రభుత్వ పథకాలను రేషన్ కార్డులను ప్రమాణికంగా తీసుకోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. రేషన్ కార్డులు జారీ కాకపోవడంతో రేషన్ కార్డుతో వచ్చే ఆరోగ్యశ్రీ సేవలను పొందలేకపోతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందలేక పోతున్నట్లు ఆవేదన చెందుతున్నారు. దరఖాస్తులు చేసి ఏడాది పూర్తయినా..రేషన్ కార్డుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన చెందుతున్నారు. పేద, మధ్య తరగతి వారికి రేషన్ కార్డులు లేకపోవడంతో అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైతే ప్రభుత్వం నుంచి అధికారులకు రేషన్ కార్డుల మంజూరికి ఎలాంటి మార్గదర్శకాలు రాలేవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రక్రియ కోసం అవసరమైన మార్గదర్శకాలు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా..కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు అందించడంలో కావాలనే కాలయాపన చేస్తున్నట్లు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. తిరిగి కొత్త వారికి రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రభుత్వ ప్రకటనతో మరింత కాలయాపన చేసేందుకే ఇలాంటి ప్రకటన చేసినట్లు చెప్పుకుంటున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు ఇచ్చిన వారికి రేషన్ కార్డులు అందిస్తూనే కొత్త వారికి రేషన్ కార్డులు అందించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.